సాక్షి నిజామాబాద్

గురువారం । 31 । అక్టోబర్ । 2024





న్యూస్‌రీల్

ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలి



నిజామాబాద్ రూరల్: ప్రభుత్వం నవంబర్ 6 నుంచి 18 వరకు చేపట్టే సామాజిక ఆర్థిక ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. బుధవారం రూరల్ మండలం ఎన్యుమరేటర్ల శిక్షణను జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ హాజరై మాట్లాడారు. తహసీల్దార్, ఎంపీడీవోల పర్యవేక్షణలో గ్రామాల కార్యదర్శులు, ఏఎస్‌ఎంలు సర్వేను నిర్వహించాలని పేర్కొన్నారు. సర్వేలో నమోదు చేసే వివరాలను గోప్యంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనురుధ్, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఎంపీవో ఎక్బాల్, సూపరింటెండెంట్ గంగాధర్, సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ సేవలకు టోల్ ఫ్రీ నంబర్



ఆర్ రవీందర్

సుభాష్‌నగర్: టీజీఎన్పీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించే క్రమంలో టోల్ ఫ్రీ సేవలను విస్తృతం చేశామని నిజామాబాద్ సర్కిల్ సూపరిన్‌టెండింగ్ ఇంజనీర్ రవీందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టోల్ ఫ్రీ నంబర్ 1912 ను ప్రతి ట్రాన్స్‌ఫార్మర్‌పై ముద్రిస్తున్నామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్లు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు, బిల్లులో హెచ్చుతగ్గులు, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్, విద్యుత్ మీటర్ల మార్పు, అన్ని రకాల కొత్త సర్వీసుల మంజూరుకు సంబంధించిన పేరు మార్పు, కేటగిరి, లోడ్ మార్పు, తదితర సమస్యల కోసం టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించి సేవలు పొందాలని కోరారు.

2న సీనియర్ బాల్‌బ్యాడ్మింటన్ జట్ల ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి (నిజామాబాద్, కామారెడ్డి) జిల్లా సీనియర్ మహిళ, పురుషుల విభాగాల్లో ఎంపికలను నవంబర్ 2వ తేదీన నిర్వహించనున్నట్లు నిజామాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మానస గణేశ్, శ్యామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్మూర్‌లోని విజయ్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో ఎంపికలు ఉంటాయని, ఎంపికైన క్రీడాకారులను హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించనున్న 70వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు.

రేపు సాఫ్ట్, బేస్‌బాల్ జట్ల ఎంపిక

నిజామాబాద్‌నాగారం: స్కూల్ గేమ్స్ అండర్–19 సాఫ్ట్‌బాల్, బేస్ బాల్ ఉమ్మడి జిల్లా (నిజామాబాద్, కామారెడ్డి) బాలబాలికల జట్లను నవంబర్ 1వ తేదీన ఎంపిక చేయనున్నట్లు జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ టి రవికుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆర్మూర్‌లోని సాంఘిక సంక్షేమ బాలుర కళాశాల మైదానంలో ప్రిన్సిపాల్ పూర్ణచందర్ ఆధ్వర్యంలో బాలుర ఎంపికలు, సుద్దపల్లి సాంఘిక సంక్షేమ కళాశాల మైదానంలో ప్రిన్సిపాల్ నళిని ఆధ్వర్యంలో బాలికల ఎంపికలు ఉంటాయని వివరించారు. 2006 జనవరి 1 తరువాత జన్మించిన క్రీడాకారులు అర్హులని తెలిపారు.

కబడ్డీ పోటీలు..

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి కబడ్డీ టోర్నీ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ –19 బాలుర విభాగంలో నిర్వహించే పోటీలకు క్రీడాకారులు తమ ఒరిజినల్ బోనఫైడ్ సర్టిఫికెట్‌తో హాజరుకావాలని సూచించారు.



నగరంలోని గాంధీచౌక్‌లో లక్ష్మీదేవి ప్రతిమలు కొంటున్న మహిళలు

దివ్యకాంతుల దీపావళి

- చెడుపై మంచి విజయానికి సూచికగా జరుపుకునే పండుగ
- లక్ష్మీ పూజలకు ఏర్పాట్లు చేసుకున్న ప్రజలు, వ్యాపారులు
- పండ్లు, పూలు, స్వీట్లు, పటాకులు జోరుగా కొనుగోళ్లు



భారతీయ పండుగలలో దివ్య దీప్తుల దీపావళికి ప్రత్యేక స్థానం ఉంది. చెడుపై మంచి విజయానికి సూచికగా గురువారం జిల్లాలో ప్రజలు ఈ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోనున్నారు. పురాణ ఇతిహాసాల ప్రకారం ఆశ్వయుజ బహుళ చతుర్దశినాడు లోక కంతకుడైన నరకాసురుని మరణం సంభవించింది. నరకాసురుని పీడ విరగడైందన్న సంతోషంతో ఆ మరుసటి రోజు ప్రజలు సంబరాలు జరుపుకుంటారు. ఈ సంబరాలు జరుపుకునే రోజు అమావాస్య కావడంతో చీకటిని పారదోలుతూ ప్రజలు దీపాలతో తోరణాలు వెలిగించి, బాణసంచా కాల్చి వేడుక జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇదిలా ఉండగా దీపావళి పండుగను పురస్కరించుకొని ఒక రోజు ముందే జిల్లాలో సందడి మొదలైంది. పూజాసామగ్రి, అరటి, మామిడి ఆకులు, గుమ్మడికాయలు, లక్ష్మీదేవి ప్రతిమలు, పువ్వులు, పండ్లు, స్వీట్లు,దీపెంతలు కొనుగోలు చేశారు. లక్ష్మీ పూజల అనంతరం పటాకులు కాల్చుతారు. పటాకుల కొనుగోళ్లు జోరుగా సాగాయి. – నిజామాబాద్ రూరల్



గంజ్‌లోని రైల్వేగేట్ వద్ద కొబ్బరి మట్టలు, బంతి పువ్వుల చెట్లు, అరటి కొమ్మలు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు



దీపెంతలు కొనుగోలు చేస్తున్న మహిళలు



లక్ష్మీదేవి చిత్రపటాలు, పండ్లు కొనుగోలు చేస్తున్న మహిళలు



లక్ష్మీదేవి పూజలో వినియోగించే పేలాలు కొనుగోలు

కుప్పలు.. తెప్పలుగా..

- నెలన్నర క్రితం వరి కోతలు ప్రారంభం
- 629 కొనుగోలు కేంద్రాలకు గాను 303 కేంద్రాలు ప్రారంభం
- ఇంకా ప్రారంభం కాని కొనుగోళ్లు
- దీపావళి తర్వాతే ధాన్యం సేకరణ
- ధాన్యం దించుకునేందుకు ఒప్పుకున్న మిల్లర్లు
- డిఫాల్టర్లకు కేటాయింపులు నిలిపేయాలని ప్రభుత్వ ఆదేశాలు జారీ



నందిపేట్ మండలం బజార్ కొత్తూర్ గ్రామానికి చెందిన రైతు గోపు మొగులాజీ 12 ఎకరాల్లో వరిపంట సాగు చేశాడు. కోతలు పూర్తి చేసి వడ్లను కొనుగోలు కేంద్రానికి తరలించి 40 రోజులవుతోంది. అప్పటి నుంచి ధాన్యాన్ని కేంద్రంలోనే ఆరబెట్టి కుప్పలుగా పోగు చేసి టార్పాలిన్ కప్పి ఉంచాడు. అధికారులు కొనుగోళ్లు ప్రారంభించక పోవడంతో ధాన్యాన్ని వ్యాపారులకు అమ్ముకునేందుకు సిద్ధమవుతున్నాడు.



మోపాల్ మండలం కంజరలో ఆరబెట్టిన ధాన్యం

సుభాష్‌నగర్/నందిపేట్/మాక్లూర్ : జిల్లాలో వరికోతలు నెలన్నర కిందటే ప్రారంభమయ్యాయి. 303 కొనుగోలు కేంద్రాలను ప్రాంభించిన అధికారులు ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు మాత్రం చేయలేదు. దీంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోత కోసిన ధాన్యాన్ని చాలా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల వద్దకు తరలించి ఆరబెడుతున్నారు. ఇలా ఆయా గ్రామాల్లో ధాన్యం రాశులు కుప్పలు తెప్పలుగా పేరుకుపోయాయి. దీంతో మరికొందరు రైతులు కల్లాల వద్దే ధాన్యాన్ని దళారులకు అమ్ముకుంటున్నారు. మరోవైపు ప్రభుత్వం రూ. 500 బోనస్ ప్రకటించడంతో వరి కొనుగోలు ఎప్పుడెప్పుడా అని రైతులంతా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో ధాన్యం కొనుగోలు పాలసీ ఉత్తర్వుల జీవోను ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందే. జీవో ప్రకారం రైస్‌మిల్లర్లు కూడా ధాన్యం దించుకునేందుకు ఒప్పుకున్నారు.



జిల్లాలో 4.30 లక్షల ఎకరాల్లో

డిఫాల్ట్ అయిన రైస్ మిల్లులకు ధాన్యం కేటాయింపులు నిలిపేయాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాలో 629 కొనుగోలు కేంద్రాలకు గాను ఇప్పటికే 303 కేంద్రాలు ప్రారంభం కాగా, మరో రెండు, మూడ్రోజుల్లో మిగతా కేంద్రాలు కూడా ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 4.30 లక్షల ఎకరాల్లో వరి సాగుచేశారు. 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 465 కొనుగోలు కేంద్రాల ద్వారా సన్నరకాలు, 164 కేంద్రాల ద్వారా దొడ్డురకాలను సేకరించనున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 299 మిల్లులకు ధాన్యం కేటాయింపులు చేపట్టనున్నట్లు తెలిసింది. ధాన్యం విక్రయించిన డబ్బులు తొలుత జమ చేయనున్నారు. బోనస్ రూ.500 మాత్రం తర్వాత జమ చేస్తామని ప్రభుత్వం జీఓలో పేర్కొంది.

క్యాలిబర్ మిషన్ల కొరత..!

ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించడంతో సన్నరకాలకు డిమాండ్ పెరిగింది. ఇందుకుగాను 33 ప్రత్యేక సన్నరకాలను అధికారికంగా ప్రకటించింది. బియ్యం కొలిచేందుకు డిజిటల్ గ్రెయిన్ క్యాలిబర్ మిషన్ల కొరత తీవ్రంగా ఉంది. పంజాబ్ రాష్ట్రం నుంచి వాటిని తెప్పించేందుకు టెండర్ చేపట్టినా.. ఎవరూ పాల్గొనలేదు. ఎలాగైనా మిషన్లను తెప్పించే పనిలో మార్కెటింగ్‌శాఖ నిమగ్నమైంది. ఈ మిషన్లు సరిపడా లేకపోతే ధాన్యం సేకరణలో లోపాలు తలెత్తే అవకాశముందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అలాగే డి ఆస్కర్లు (వడ్లు ఒలిచే యంత్రాలు) కూడా కొనుగోలు కేందాల్లో అందుబాటులో ఉంచనున్నారు.

ఆంక్షలతో మిల్లర్లకు కేటాయింపులు..

ధాన్యం సేకరణ పాలసీలో ఆంక్షల మేరకే రైస్‌మిల్లులకు ధాన్యం కేటాయింపులు చేపట్టాలని నిర్ణయించారు. రైస్‌మిల్లర్లతో జిల్లా అధికారులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ధాన్యం దించుకునేందుకు మిల్లర్లను ఒప్పించడం అధికారులకు తలకు మించిన భారమైంది. డిఫాల్ట్ కాని వారు 10 శాతం బ్యాంకు గ్యారెంటీ (మిల్లు సామర్థ్యం, కేటాయింపులో), డిఫాల్ట్ అయి ఉండి ఫెనాల్టీతో 125 శాతం చెల్లించిన వారు 20 శాతం బ్యాంకు గ్యారెంటీ, పెనాల్టీ కట్టకుండా, కేవలం 100 శాతం చెల్లించిన వారు 25 శాతం బ్యాంకు గ్యారెంటీతో పాటు ఫెనాల్టీలో 25 శాతం కూడా గ్యారెంటీ ఇవ్వాల్సి ఉంటుంది. ధాన్యం ఇవ్వని 35 మంది రైస్‌మిల్లర్లకు కేటాయింపులు జరపకుండా, 299 మిల్లులకు ధాన్యం కేటాయించాలని అధికారులు నిర్ణయించారు. గడువులోపు సీఎంఆర్ ఇచ్చిన వారికి మాత్రమే పెంచిన మిల్లింగ్ చార్జీలు వర్తించనున్నాయి.

కేంద్రాలు వెంటనే ప్రారంభించండి

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వడ్ల కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ అధ్యక్షుడు దినేశ్ కులాచారి బుధవారం జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు వినతి పత్రం సమర్పించారు. జిల్లాలో 4 లక్షల 29 వేల ఎకరాలలో వరి సాగైందన్నారు. రైతులు కోసిన ధాన్యాన్ని నిల్వ చేసుకోలేక రోడ్లపై కుప్పలుగా పోశారని, అకాల వర్షాలు వస్తే తీవ్ర నష్టం కలుగుతుందన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్, బీజేపీ అధ్యక్షుడు దినేశ్

లోపాలు లేకుండా..



జిల్లాలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ధాన్యం సేకరణ చేపడుతాం. మిల్లర్లు కూడా ధాన్యం దించుకునేందుకు ఒప్పుకున్నారు. అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేస్తున్నాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మిల్లులను కేటాయిస్తాం. సోమవారం నుంచి ధాన్యం సేకరణ వేగవంతం చేసేలా చర్యలు చేపడుతున్నాం.
– అరవింద్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

ప్రభుత్వంపై నమ్మకం లేదు.



వరి ధాన్యం చేతికి వచ్చి నెల రోజులు అయింది. ప్రభుత్వం నామ్కే వాస్తేగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించింది. కాంటాలు మాత్రం జరగడం లేదు. ఇంకా ఎన్ని రోజులు వెయిట్ చేయాలి. సన్న రకం వడ్లకు 500 బోనస్ ఇస్తామన్నారు. అది గ్యారెంటీ లేదు. కూలీల అద్దె తడిసి మోపెడవుతోంది. ప్రభుత్వం దీపావళి తర్వాత అయినా కొనుగోలు జరపాలి.
– ముప్పా గంగారెడ్డి, రైతు గొట్టిముక్కుల, మాక్లూర్

ఇప్పటికైతే అనుమతి లేదు..

ఇప్పటికైతే ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి రాలేదు. నాకు తెలిసి దీపావళి తర్వాత కొనుగోలు ప్రారంభం అవుతాయి.
– బూరోల్ల అశోక్, సొసైటీ చైర్మన్ మాక్లూర్

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అకౌంటెంట్, ఏఎస్‌ఎం పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. రెండు అకౌంటెంట్, ఐదు ఏఎస్‌ఎం పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఏఎస్‌ఎం పోస్టుకు దరఖాస్తు చేసుకునేవారు ఎంపీహెచ్ శిక్షణ, ఇంటర్మీడియెట్ పూర్తి చేసి ఉండాలని, అకౌంటెంట్ పోస్టుకు డిగ్రీతోపాటు బీకాం పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. అన్ని ధ్రువపత్రాలను జత చేసి ఈనెల 5వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమగ్రశిక్ష కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని సూచించారు.

లక్ష్యసాధనలో విద్యార్థులు ముందుకెళ్లాలి

డిచ్‌పల్లి: విద్యార్థినులు నిర్దిష్టమైన లక్ష్యంతో ముందుకు సాగాలని అప్పుడే మంచి ఫలితాలు సాధించొచ్చని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. సుద్దపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలను న్యాయమూర్తి బుధవారం సందర్శించారు. ఆమె మాట్లాడుతూ.. గురుకులాల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. ఆడపిల్లలకు ఆత్మరక్షణ చాలా ముఖ్యమని, అందుకోసం శిక్షణ తీసుకుని తమను తాము కాపాడుకునేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఆడపిల్లలకు ఏదైనా సమస్య ఉంటే 1098కు ఫోన్ చేయాలన్నారు. 18 సంవత్సరాలు నిండని వారు వాహనాలు నడిపిస్తే చట్ట ప్రకారం శిక్షార్హులన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి రాజశ్రీ, మండల ప్రత్యేకాధికారి యోహాన్, ఎంపీడీవో రవీందర్, తహసీల్దార్ ప్రభాకర్, ఎస్సై మహ్మద్ షరీఫ్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నళిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. న్యాయమూర్తి సునీత కుంచాలపై ఇటీవల 'సాక్షి'లో ప్రచురితమైన కథనాన్ని కళాశాల ప్రిన్సిపాల్ నళిని ఫొటోఫ్రేమ్‌గా చేయించి అందజేశారు.



'సాక్షి' కథనాన్ని ఫొటోఫ్రేమ్‌గా జడ్జి కుంచాల సునీతకు అందజేస్తున్న ప్రిన్సిపాల్ నళిని









రోడ్డుపై పూలు అమ్మొచ్చు.. బైక్‌లు నిలుపొద్దు!!



దీపావళి నేపథ్యంలో సందడిగా మారిన రోడ్లపై ట్రాఫిక్ పోలీసులు విచిత్రమైన రూల్స్ అమలు చేస్తున్నారని వాహనదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై పూలు, ఇతర సామగ్రి విక్రయిస్తున్నా పట్టించుకోని పోలీసులు.. కొనుగోలుదారులు బైక్‌లు నిలిపితే ఫొటోలు తీస్తూ చలాన్లు రాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూలు, పూజా సామగ్రి కొనేందుకు వచ్చిన తాము బైక్‌లు ఎక్కడ నిలపాలో పోలీసులే చూపించాలని వారు అంటున్నారు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్













స్వచ్ఛతకు మారుపేరు విజయ డెయిరీ

- పాలలో ఏమాత్రం కల్తీకి ఆస్కారం లేదు
- రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు మేలు చేస్తోంది
- పాడిపరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య చైర్మన్ అమిత్‌రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



సిబ్బందితో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి, అమిత్‌రెడ్డి

నిజామాబాద్ రూరల్: విజయ డెయిరీ పాలు స్వచ్ఛతకు మారుపేరని, ఏ మాత్రం కల్తీకి ఆస్కారం ఉండదని రాష్ట్ర పాడిపరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి అన్నారు. మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో కలిసి సారంగాపూర్‌లోని విజయ డెయిరీని చైర్మన్ అమిత్‌రెడ్డి బుధవారం సందర్శించారు. అధికారులతో మాట్లాడి పాల సేకరణ, విక్రయాల వివరాలు తెలుసుకున్నారు. పాల శీతలీకరణ ప్రక్రియను పరిశీలించి, పాడి రైతులతో భేటీ అయి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడి రైతులకు మేలు చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పాడి పరిశ్రమకు తోడ్పాటునందిస్తోందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా సీఎం రేవంత్‌రెడ్డి రూ.50కోట్ల నిధులు విడుదల చేశారని, అదనంగా మరో రూ.10కోట్ల బకాయిలను పాడి రైతులకు చెల్లించినట్లు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాల కారణంగానే విజయ పాల విక్రయాలు గణనీయంగా పెరిగాయని, మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ప్రతి రోజూ విజయ డెయిరీ యూనిట్ల ద్వారా 4.40 లక్షల లీటర్ల పాలను సేకరిస్తుండగా, 3.20 లక్షల లీటర్ల పాలు మాత్రమే అమ్ముడవుతున్నాయని తెలిపారు. మిగిలిన పాలను మిల్క్ పౌడర్‌గా, వెన్నగా మార్చేందుకు చిత్తూరు జిల్లాకు పంపించాల్సి వస్తుండడంతో సంస్థపై ఆర్థిక భారం పడుతోందన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో పాడి రైతులకు అత్యధిక ధర చెల్లిస్తున్నట్లు తెలిపారు. పాడి పరిశ్రమలో నష్టాలను నివారిస్తూ, లాభాల బాటలో పయనింపజేసేందుకు ఎలాంటి చర్యలు చేపడితే బాగుంటుందో రైతు సంఘాలు కూడా ఆలోచనలు చేయాలని సూచించారు.

పూర్తి సహకారం అందిస్తా

విజయ డెయిరీ అభివృద్ధికి జిల్లా యంత్రాంగం తరఫున పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. పాలు వినియోగించే అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో విజయ డెయిరీ పాలనే వినియోగించాలని సూచించారు.

పాడిరైతులకు తోడ్పాటునందించాలి

జిల్లాలో వినియోగం అవుతున్న పాలలో కేవలం పది శాతం మాత్రమే విజయ డెయిరీ పాల ను వినియోగిస్తున్నారని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. ముల్కనూరులో రైతులు సమాఖ్యగా ఏర్పడి సమష్టి కృషితో సత్ఫలితాలు సాధించారని, అదే స్ఫూర్తితో జిల్లాలోని పాడి రైతులు కూడా కృషి చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, సారంగాపూర్ విజయ డెయిరీ యూనిట్ ఉప సంచాలకులు నాగేశ్వర్‌రావు, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు జగన్నాథచారి, పాడి రైతుల సంఘం ప్రతినిధులు సురేశ్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు




కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ

నిజామాబాద్ అర్బన్/ఖలీల్‌వాడి: జిల్లా ప్రజలకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ వేర్వేరు ప్రకటనల్లో దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరి జీవితాల్లో కష్టాల నే కారుచీకట్లు తొలగిపోయి, చిరుదివ్వెల వెలుగుల వలే అనునిత్యం సుఖ సంతోషాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు. చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ ఎంతో ఉత్సాహంగా నిర్వహించుకునే దీపావళి పండుగను ప్రమాదాలకు తావులేకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తూ, ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



మాక్లూర్: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు అండర్ - 14 బాలికల విభాగంలో అమ్రాద్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని ఏ శ్రీనిత్య ఎంపికైంది. ఇటీవల కామారెడ్డిలో నిర్వహించిన అండర్ - 14 బాలికల విభాగంలో పోటీలు నిర్వహించగా శ్రీనిత్య ఉత్తమ ప్రతిభకనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పీడీ అనురాధా తెలిపారు. బుధవారం పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి శ్రీనిత్యను అభినందించారు.

ఆర్టీసీలో కారుణ్య నియామకాలు



ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో కారుణ్య నియామకాల్లో భాగంగా 33 మంది పురుషులు, కరీంనగర్ రీజియన్‌లో 18 మంది మహిళలకు నియామకపత్రాలు అందజేసినట్లు ఆర్ఎం జానీరెడ్డి బుధవారం తెలిపారు. దీపావళి పర్వదినాన తమకు ఉద్యోగాలు రావడం ఆనందంగా ఉందని కారుణ్య నియామకాలు పొందిన ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేశారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో మనోజ్‌కు చోటు



నిజామాబాద్ నాగారం: తైక్వాండో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కోచ్ మనోజ్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటుదక్కించుకున్నారు. 12వేల మంది విద్యార్థినులకు సెల్ఫ్‌డిఫెన్స్ నేర్పించడంతో ఆయన రికార్డుకెక్కారు. జిల్లా జడ్జి కుంచాల సునీత, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ బుధవారం మనోజ్‌ను అభినందించారు.

బోధన్ నుంచి ఎయిర్‌పోర్టుకు సూపర్ లగ్జరీ

బోధన్: శంషాబాద్ ఎయిర్‌పోర్టు బోధన్ నుంచి నవంబర్ 4వ తేదీ నుంచి ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు నడపనున్నట్లు డీఎం శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ సాయంత్రం 5.30 గంటలకు బస్సు బోధన్ నుంచి బయల్దేరుతుందని, వర్ని, బాన్సువాడ, మెదక్, నర్సాపూర్, జేబీఎస్ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రాత్రి 12 గంటలకు చేరుకుంటుందని పేర్కొన్నారు. మరుసటి రోజు ఉదయం 5.30 గంటలకు ఎయిర్‌పోర్టు నుంచి బయల్దేరి బోధన్‌కు ఉదయం 11.10 గంటలకు చేరుకుంటుందని వివరించారు. బోధన్ నుంచి ఎయిర్ పోర్టుకు ఒక్కొక్కరికి రూ.590 చార్జీ ఉంటుందని తెలిపారు.

పాములూరుకు అదనంగా మరో బస్సు..

బోధన్ నుంచి పాములూరుకు అదనంగా మరో బస్సును ప్రారంభించనున్నట్లు డీఎం తెలిపారు. ఈ సర్వీసు ప్రతి రోజూ బోధన్ బస్టాండ్ నుంచి మధ్యాహ్నం 3.45 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం6.15 గంటలకు పాములూరుకు చేరుకుంటుందని తెలిపారు. తిరిగి అదేరోజు సాయంత్రం 7 గంటలకు అక్కడి నుంచి బయల్దేరి ఉదయం 8.45 గంటలకు బోధన్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాలికపై అత్యాచారయత్నం

బాన్సువాడ: పట్టణంలోని పెద్ద హనుమాన్ మందిరం ఎదురుగా ఉన్న ఓ పాడుబడిన ఇంటి ఆవరణలో బుధవారం సాయంత్రం ఏడేళ్ల బాలికపై సుమారు 50ఏళ్ల వ్యక్తి అత్యాచార యత్నం చేశాడు. బాలికకు మాయమాటలు చెప్పి పాడుబడిన ఇంట్లోకి బాలికను తీసుకెళ్లిన సమయంలో చూసిన ఓ యువకుడు సదరు వ్యక్తిని నిలదీశాడు. దీంతో ఆ వ్యక్తి తప్పయిందని అంటూ పారిపోయాడు. బాన్సువాడ పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



చింత కిషన్(ఫైల్)

కమ్మర్‌పల్లి: స్కూటీని వెనుక నుంచి లారీ ఢీకొట్టిన ఘటనలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందా డు. మండల కేంద్రంలోని మెట్‌పల్లి రోడ్డులో ఉన్న భారత్‌పెట్రో ల్ బంక్ వద్ద మంగళవారం రాత్రి చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కమ్మర్‌పల్లికి చెందిన చింత కిషన్(28) బిర్లా కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తూ ఇంటి నుంచే విధులు నిర్వర్తిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం తన స్నేహితుడు హరీశ్‌గౌడ్‌తో స్కూటీపై మెట్‌పల్లికి వెళ్లాడు. రాత్రి సమయంలో తిరిగి వస్తూ పెట్రోల్ పోయించేందుకు కమ్మర్‌పల్లి శివారులోని భారత్ పెట్రోల్ బంక్‌లోకి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో కిషన్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పండగకు అత్తారింటికి వెళ్తూ..



ప్రవీణ్(ఫైల్)

బాన్సువాడ రూరల్: మండలంలో బోర్లం గ్రామాని కి చెందిన జోగొల్ల ప్రవీణ్(25) బుధవారం బీర్కూ ర్ మండలం దామరంచ గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీపావళి పండుగకు హస్గుల్‌లోని తన అత్తగారి ఇంటికి బైక్‌పై వెళ్తుండగా దామరంచ శివారులో ఐచర్ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్రగాయాలై ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనాస్థలానికి చేరుకొని బోరున విలపించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు బీర్కూర్ ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

రైలు కిందపడి మహిళ ఆత్మహత్య

ఖలీల్‌వాడి: ఆవేశంలో రైలు కిందపడి ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి బుధవారం తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బోధన్ ఆచన్‌పల్లికి చెందిన ఆసది సుజాత(38)కు 14 సంవత్సరాల క్రితం అర్సపల్లికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఆసది రవితో వివాహమైంది.వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.ఎప్పుడూ ఆవేశంగా ఉండే సుజాత తరచూ భర్తతో, పక్క ఇంటి వారితో గొడవపడేది. మంగళవారం రోజున సైతం గొడవ జరిగింది. ఈ క్రమంలో ఆవేశంతో రాత్రి 9.30గంటలకు సుజాత ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. భర్త ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించ లేదు.సుజాత బుధవారం ఉదయం రైలు పట్టాల పక్కన శవమై కనిపించింది. తన భార్య మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని భర్త రవి పోలీసులకు అందజేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడిపై స్నేక్‌గ్యాంగ్ దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హబీబ్‌నగర్ లో ఓ యువకుడిపై స్నేక్ గ్యాంగ్ దాడి చేసినట్లు తెలిసింది. గ్యాంగ్‌లోని సభ్యుడి అనుమతి లేకుండా కాలనీలోకి రావొద్దని, పాతకక్షలతో యువకుడిపై దాడి చేసి, బెదిరింపులకు పాల్పడినట్లు తెలిసింది. ఈ దాడిలో గాయాలపాలైన యువకుడిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. బాధితుడి కుటుంబ సభ్యులు ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఎస్‌హెచ్‌వో రఘుపతిని వివరణ కోరగా.. దాడి ఘటనపై విచారణ చేపట్టినట్లు తెలిపారు.

పేకాటస్థావరంపై దాడి

రుద్రూర్: పొతంగల్ మండలం జల్లాపల్లి ఫారంలో కొనసాగుతున్న పేకాటస్థావరంపై బుధవారం అర్ధరాత్రి దాడి చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని రూ.7,350 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

మత్తుపదార్థాల పట్టివేత

బోధన్‌రూరల్: సాలూర అంతరాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో బుధవారం మత్తుపదార్థాలు (అల్ప్రాజోలం, క్లోరోఫాం, డైజోఫాం) పట్టుబడినట్లు బోధన్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. సాలూర చెక్‌పోస్ట్ వద్ద మహారాష్ట్ర బస్సులో తనిఖీ నిర్వహిస్తుండగా.. ఓ వ్యక్తి బ్యాగుతో పారిపోయే ప్రయత్నంచేశాడని, అతడిని పట్టుకుని విచారించగా బ్యాగులో మత్తుపదార్థాలు ఉన్నట్లు తేలిందన్నారు. మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకుని మాదకద్రవ్యాల నిరోధకచట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సాలూర చెక్‌పోస్టు వద్ద నిషేధిత గుట్కా...

బోధన్‌రూరల్ : సాలూర అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద బుధవారం తనిఖీలు నిర్వహిస్తుండగా రూ.23వేల విలువైన నిషేధిత గుట్కా పట్టుబడినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. మహారాష్ట్రకు చెందిన అజాం అనే వ్యక్తి సాలూర నుంచి మహారాష్ట్ర వైపు బస్సులో గుట్కా ప్యాకెట్లు తీసుకెళ్తుండగా పట్టుబడ్డాడని తెలిపారు. గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. మహారాష్ట్రలో ఎన్నికల సందర్భంగా ప్రత్యేకంగా చెక్ పోస్టు ఏర్పాటు చేసినట్లు ఎస్సై తెలిపారు.